ఖేడ్‌లో అర్బన్ పార్క్



అర్బన్ పార్కు ప్రధాన గేటు

తీరనున్న ఏళ్లనాటి కల

- త్వరలో పనులు ప్రారంభం
- రూ.3.86 కోట్లతో నిర్మాణం
- అన్ని సదుపాయాలతో ఏర్పాటు

నారాయణఖేడ్: పట్టణీకరణ పెరిగిపోవడం, పట్టణంతోపాటు సమీప గ్రామాల వారికి కనీసం కుటుంబంతో కొంతసేపు ఉల్లాసంగా గడుపుదామన్నా ఎలాంటి సదుపాయాలు ఖేడ్‌లో లేవు. అయితే ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్బన్ పార్కు గల నారాయణఖేడ్ ప్రాంత వాసులకు త్వరలో తీరనుంది. నారాయణఖేడ్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలోని వెంకటాపూర్ వద్ద అటవీశాఖకు చెందిన సుమారు 350 ఎకరాల అటవీ ప్రదేశంలో రూ.3.86కోట్లతో అర్బన్ పార్కును ఏర్పాటు చేయనున్నారు.

ఆహ్లాదకర వాతావరణం మధ్య...

జాతీయ రహదారి 161బీ పైన వెంకటాపూర్ వద్ద 350 ఎకరాల దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాంతంలో భారీ వృక్షాలు, పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఇక్కడ పార్క్ ఏర్పాటుకు రూ.3.86కోట్లు వ్యయం అవుతుందని అటవీశాఖకు ప్రతిపాదనలు పంపించగా...మొదటి విడతగా రూ.1.77కోట్లకు అనుమతి లభించింది. ఇప్పటికే డీఎఫ్ఓ ఖాతాలో రూ.90లక్షల నిధులను ప్రభుత్వం జమ చేసింది. అతి త్వరలో ఈ పనులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఖేడ్ చుట్టుపక్క వాసులకు సౌలభ్యం

ఖేడ్ పట్టణం అన్ని మండలాలకు మధ్యస్థంగా ఉండటంతో అన్ని మండలాల జనాలు ఖేడ్‌కు వచ్చేందుకు అనుకూల ప్రాంతంగా ఉంది. ఖేడ్ పట్టణం చుట్టుప్రక్కల మండలాల వారికి, ఖేడ్‌లో ఉండే దాదాపు 45వేల మందికి ఈ పార్కు సదుపాయంగా ఉండనుంది.

పూర్తి సౌకర్యాలు..

అర్బన్ పార్కులో ఎనిమిది కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్, అటవీ ప్రాంతంలోపల రోడ్డు సదుపాయం, 45 అడుగుల ఎత్తున వాచ్‌టవర్, రెండు గజబో (పగోడ), రెండు ఓపెన్ జిమ్స్ నిర్మించనున్నారు. ఇదివరకే రెండు కుంటలు నిర్మించి ఉండడంతో అందులో నీటి సదుపాయం ఉంది. పశు పక్ష్యాదులు, వన్యప్రాణులకోసం 3కిలోమీటర్లకు ఒకటి చొప్పున 5వరకు సాసర్‌పిట్స్, పార్కుకు వచ్చే ప్రజల కోసం షెల్టర్, గార్డు రూం, టాయ్‌లెట్స్, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నారు.

మంచి సదుపాయం



ఈ అర్బన్ పార్కు ఏర్పాటుతో కుటుంబంతో కాసేపు సరదాగా గడిపేందుకు ఆస్కారం ఉంటుంది. అన్ని సదుపాయాలతో అర్బన్ పార్క ఏర్పాటు చేస్తుండడంతో చాలా ఏళ్ల కల తీరినట్లయ్యింది.

- జనార్ధన్‌రెడ్డి, వ్యాపారి, నారాయణఖేడ్

త్వరలో పనులు



అర్బన్ పార్కు కోసం రూ.3.86కోట్లతో ప్రతిపాదించాం. టెండర్లు పూర్తి కాగానే త్వరలో పనులు ప్రారంభం అవుతాయి. ఖేడ్‌లో అన్ని సదుపాయాలతో మంచి ఆహ్లాదకర పార్కు ఏర్పాటు కాబోతుంది.

- శ్రీధర్‌రావు, డీఎఫ్ఓ, మెదక్

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం: జడ్జి షరీఫ్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్

జోగిపేట(అందోల్): విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని, వాటికి అనుగుణంగా భవిష్యత్‌ను నిర్మించుకోవాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. బుధవారం అందోలు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ అవసరానికి మించి వాడకూడదన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం, బీఎన్ఎస్ జువైనల్ తదితర చట్టాల గురించి విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. చట్టాలపై అవగాహన లేక కొందరు భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సార వెంకటేశం, మల్లేశం, ఎస్సై పాండు, ప్రిన్సిపాల్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మనూరు మండలం ఎల్గొయికి చెందిన సంతోష్‌రావుకు రూ.15 వేల చెక్కు, నిజాంపేట మండలం ఎర్రగుంట తండాకు చెందిన గమినీ బాయికి రూ.2.50 లక్షల ఏల్వోసీ మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పరశురాం, మనూరు బీఆర్ఎస్ అధ్యక్షుడు విఠల్‌రావుపటేల్, ఖేడ్ పట్టణ అధ్యక్షుడు నగేష్, నాయకులు విఠల్, ప్రభాకర్, మల్గొండ, లయక్ పాల్గొన్నారు.

రక్షణ పరికరాలు ధరించాలి



కార్మికులకు రక్షణ పరికరాలు అందజేస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో రక్షణ పరికరాలు విధిగా ధరించాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నమస్తే వేడుకల్లో భాగంగా రక్షణ పరికరాలు హెల్మెట్లు, చేతి తొడుగులు, దుస్తులు తదితర వాటిని పారిశుద్ధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచే విషయంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కట్టమైసమ్మ ఆలయ పరిసరాలు, రాంవిలాస్ గల్లీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నాయకులు భూమి పూజ చేశారు. బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ లబ్ధిదారులు, నాయకులతో కలిసి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి వీరేషం, నాయకులు ఉదయ్ శంకర్‌పాటిల్, సంగ్రాం పాటిల్, వేణుగోపాల్‌రెడ్డి, మారుతి రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో డిజిటల్ తరగతులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం భౌతికశాస్త్రానికి సంబంధించిన తరగతిని డిజిటల్‌లో నిర్వహించారు. తెరపై నిర్వహించిన తరగతులను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. డిజిటల్ పద్ధతిలో తరగతులు ప్రయోజనకరంగా ఉన్నట్లు విద్యార్థులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేష్ కుమార్ తరగతులను పర్యవేక్షించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



వడ్డీ లేని రుణాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలోని మహిళలకు సుమారు రూ. 11 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయా గ్రూపులకు అందజేశారు. వివిధ కారణాలతో మృతిచెందిన ఐదుగురు మహిళా సమైక్య సంఘాల సభ్యురాల కుటుంబాలకు రూ. 12 లక్షల 50 వేల విలువైన ఇన్సూరెన్స్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో 7 వేలకు పైగా మహిళా సమైక్య గ్రూపులు పనిచేయడం సంతోషకరమన్నారు. సిగాచీ పరిశ్రమ దుర్ఘటన అంశంలో కలెక్టర్ ప్రావీణ్య చూపించిన చొరవ ప్రశంసనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, డీఆర్డీఏ వెంకటేశ్వర్లు, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించారు.. నివేదిక మరిచారు

బొల్లారం రేండ్లకుంట సంగతేంటి?



గత నెలలో చేసిన సర్వేలో పాల్గొన్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ స్థలం కబ్జాకు గురైందని ప్రజావాణిలో అందిన ఫిర్యాదుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు గత నెలలో సంయుక్తంగా సర్వే నిర్వహించారు. పట్టణ శివారులోని సర్వే నం.71లో రేండ్ల కుంట ఉంది. దీనికి రెండెకరాల 18 గుంటల శిఖం భూమి ఉన్నట్లు రికార్డులు చూపుతున్నాయి. అయితే శిఖం భూమిలో నుంచి సుమారు 8 గుంటల స్థలాన్ని ఆకృతి నిర్మాణ సంస్థ బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టిందని, దీనిని ఆపాలని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరారు. సర్వే పూర్తయి నెల రోజులు గడుస్తున్నా నివేదిక ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా ఇదే విషయంపై జిన్నారం ఇరిగేషన్ శాఖ ఏఈ ప్రసాద్‌ను వివరణ కోరగా... రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఆయా ప్రాంతాల ఇరిగేషన్ శాఖ ఏడీలు సంయుక్తంగా సర్వే చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫిర్యాదుదారులు మాత్రం అధికారులు కాలయాపన చేస్తున్నారని ఇప్పటికైనా నివేదికను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

మునిపల్లి(అందోల్): పదవ తరగతిలో అధిక మార్కులు సాధించి ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన హారిక, జస్వంత్, శివశంకర్‌లను తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు శాలువ కప్పి సన్మానించారు. బుధవారం మండలంలోని మునిపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాములమ్మ, ఉపాధ్యాయులు కల్పన, ఆంజనేయులు, శ్రీ విద్య, ఉషశ్రీ, శైలజ, స్వరూప, కరుణాకర్‌రెడ్డి, పాషా, అష్రాఫ్ అలీ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

మాజీ మంత్రి హరీశ్‌రావు



గుమ్మడిదల నాయకులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 109 భూ బాధితుల సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావును గోవర్ధన్‌రెడ్డి స్థానికులతో కలిసి కోరారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి రైతుల సమస్యను వివరించారు. దశాబ్ద కాలం నుంచి రైతులు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని, కానీ రెవెన్యూ రికార్డుల ప్రకారం సాగులో ఉన్న రైతుల పేర్లు లేకపోవడంతో పారిశ్రామికవాడకు ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణలో తమకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని హరీశ్‌రావుతో వాపోయారు. దీంతో సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని, బీఆర్ఎస్ రైతులకు అండగా ఉంటుందని భరోసా కల్పించినట్లు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, సూర్యనారాయణ, అంజనేయులు, రాజేష్ పాల్గొన్నారు.

ఫైలేరియా నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫైలేరియా నిర్మూలనకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ వార్డు కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో జాతీయ ఫైలేరియా కార్యక్రమంపై పలు కాలనీల వాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 10వ తేదీ నుంచి 25 వరకు జాతీయ ఫైలేరియా నివారణ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కురిసిన వర్షం.. మురిసిన రైతు



రాయికోడ్‌లో కురిసిన వర్షం

రాయికోడ్(అందోల్): వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించింది. మండల కేంద్రం రాయికోడ్‌తో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులు సాగు చేసిన పత్తి మొక్కలకు ప్రాణం పోసినట్లైంది. రెండు వారాలుగా వర్షాలు లేక పత్తి మొక్కలు ఆశించిన స్థాయిలో ఎదగలేదు. తాజాగా వర్షం కురవడంతో రైతులు ఎరువులు చల్లుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలో సుమారు 38 వేల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది.

నేటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

సిద్దిపేటఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ చదువుతున్న సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట ప్రాంతీయ అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రద్ధానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించనున్న ఈ పరీక్షలకు విద్యార్థులు తమ కళాశాల గుర్తింపు కార్డు, హాల్‌టికెట్లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలోని రీజనల్ సెంటర్‌లోని 7382929615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

టీచర్ల సమస్యలపై మూడు దశల్లో పోరాటం

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడచినా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాశీనాథ్ జాదవ్ విమర్శించారు. టీచర్లు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మూడుదశల్లో పోరాటం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సంఘం సభ్యత్వ నమోదు ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన ఖేడ్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఆయాచోట్ల ఆయన మాట్లాడుతూ... మొదటిదశలో ఈనెల 23, 24 తేదీల్లో మండలస్థాయిలో తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత, ఆగస్టు 1న జిల్లా స్థాయిలో జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జహీరాబాద్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్ సూచించారు. బుధవారం మండలంలోని రంజోల్ గ్రామంలోని సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు.

క్రీడా ప్రాంగణం స్వాధీనం



స్టేడియం స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన క్రీడా ప్రాంగణాన్ని కోర్టు ఉత్తర్వులతో ఆయా శాఖల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 254 సర్వే నంబర్‌లోని 4.24 గుంటల స్థలాన్ని 2015లో క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. ఇందుకోసం 2017లో అధికారులు పంచనామా నిర్వహించి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కొంతమంది వ్యక్తులు స్థలం తమదేనని కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు స్థలాన్ని వెంటనే క్రీడా శాఖకు అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు క్రీడా రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు క్రీడా ప్రాంగణంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారి కాసిం బేగ్ సీనియర్ అసిస్టెంట్ అభినవ్ కుమార్ మాట్లాడుతూ.. రూ. 2.65 కోట్లు క్రీడా ప్రాంగణానికి కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మినీ స్టేడియం నిర్మాణానికి సంబంధించిన పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషన్, సీఐ రవీందర్ రెడ్డి, ఎస్ఐలు దశరథ్, కృష్ణారెడ్డి, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, వార్డు ఆఫీసర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

వట్‌పల్లి(అందోల్): ఆయిల్ పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఖాదిరాబాద్ రైతువేదిక భవనంలో ఆయిల్‌పామ్ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సదుపాయం ఉన్న అన్ని రకాల భూములు ఆయిల్‌పామ్ పంటల సాగుకు అనుకూలమన్నారు. పత్తి, మిర్చి, చెరుకు మామిడి వంటి పంటతో పోల్చుకుంటే పెట్టుబడితో పాటు కూలీల సంఖ్య తక్కువ అవసరం తెలిపారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ పంటలపై 15 రోజులకొకసారి 25 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, ఏఈఓ పరిమళ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి



తడ్కల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎంఈఓ ఎండీ రహీమొద్దిన్

కంగ్టి(నారాయణఖేడ్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ఎంఈఓ మహ్మద్ రహీమొద్దిన్ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని తడ్కల్ పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని చాప్టా(కే), చాప్టా(బీ), తుకారాంతండా, తడ్కల్ ఉర్దూ మీడియం పాఠశాల, ముర్కుంజాల్, ఘన్‌పూర్, సీపీఎస్ తడ్కల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల నమోదు, హాజరు శాతం, విద్యార్థుల ముఖ హాజరు, ఉపాధ్యాయుల బోధన పద్ధతులు, టీచింగ్ అండ్ లెర్నింగ్ మెటీరియల్ విషయాలను పరిశీలించారు. ఎంఈఓతో పాటు సీఆర్పీ నెనావత్ తులసీరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

నారాయణఖేడ్: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు. హైదరాబాద్ నానక్ రాంగూడలోని శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఖేడ్‌లోని శ్రీసత్యసాయి మందిరంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటిలో పొరలు వచ్చిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోన్ నంబరుతో పాటు ఏమైనా మందులు వాడితే అవి తీసుకుని శిబిరానికి రావాలన్నారు. ఖేడ్ ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ ఆర్థిక సాయం అందజేత

మునిపల్లి(అందోల్): 18 సంవత్సరాలు నిండిన విష్ణుకు వినికిడి యంత్రానికి సంబంధించి రూ. 20 వేలను బుధవారం అరేళ విష్ణుకు కాంగ్రెస్ నాయకులు ప్రమోద్ కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. చెవుడుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విష్ణుకు విషయం తెలుసుకుని సహాయం చేశారు. కార్యక్రమంలో విజయ్, నీలం, శ్రీనివాస్, సంగ్రామ్, నైకోటి సుధాకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

◆ నీటి సమస్యను పరిష్కరించాలి



జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని మూడో వార్డులో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బుధవారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల వార్డులోని బోరు మోటార్ చెడిపోవడంలో మరమ్మతులు చేపట్టకపోవడం, నల్లా నీరు కుడా రాకపోవడంతో సమస్య తీవ్రత మరింత పెరిగిందన్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే బోరు మోటార్ మరమ్మతులు చేపట్టి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

◆ వాహనదారులకు నిబంధనలు తప్పనిసరి

న్యాల్‌కల్(జహీరాబాద్): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్ ఎంవీఐ వెంకటయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని హుస్నెళ్లి చెక్ పోస్టు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా గణేష్‌పూర్ నుంచి కర్నాటక ప్రాంతానికి తరలిస్తున్న ఎర్ర రాయి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి హద్నూర్ పోలీసులకు అప్పగించారు.

◆ పనులు నాణ్యతతో చేపట్టాలి

పటాన్‌చెరు టౌన్: అంతర్గత డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరగాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. బుధవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, జేపీ కాలనీలలో జరుగుతున్న నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం శివకృష్ణ, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు

◆ యథేచ్ఛగా చెట్ల నరికివేత



జిన్నారం(పటాన్‌చెరు): మండలంలో రోడ్ల పక్కన హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అవి కాస్త విద్యుత్ తీగలకు తగులుతుండడంతో విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మల నరికివేతకు స్వీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపతిగూడెం వావిలాల ప్రధాన రహదారి పక్కన గల చెట్లను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ని రోజులు ఆహ్లాదాన్ని ఇచ్చిన పచ్చని చెట్లు లేక ప్రస్తుతం రోడ్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం, అవి పెరిగి పెద్దయ్యాక నరికివేతకు గురవడం పరిపాటిగా మారింది.

◆ 19న ప్రజాదర్బార్

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధి హామీ పనులపై ఈ నెల 19న ప్రజాదర్బార్ (సోషల్ ఆడిట్)ను నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు.

లింపి వైరస్ సోకకుండా పశువులకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ ముస్తాక్‌అలీ

కంగ్టి(నారాయణఖేడ్): లింపి వైరస్ నుంచి పశువులను రక్షించుకోవాలని కంగ్టి మండలంలోని రైతులకు అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ ముస్తాక్‌అలీ తెలిపారు. లింపి వైరస్ సోకిన పశువులకు శరీరంపై గుండ్రని ఉబ్బెత్తు మచ్చలు ఏర్పడి చర్మం తొలిగిపోతుందన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధిలో ఇతర పశువులకు సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా వ్యాధి సోకకుండా వ్యాక్సినేషన్ వేయించుకొని పశువులను కాపాడుకోవాలన్నారు. బుధవారం మండలంలోని జీర్గీ తండాలో తెల్లజాతి పశువులకు వ్యాక్సినేషన్ చేసినట్లు తెలిపారు. 42 మంది రైతులకు చెందిన 242 పశువులకు వ్యాక్సిన్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.